

### కలెక్టరేట్‌లో గురుపౌర్ణమి
నరసరావుపేట: కలెక్టరేట్‌లో సోమవారం వ్యాసమహర్షి జయంతి (గురుపౌర్ణమి) సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యామ్‌ప్రసాద్ పూలమాలలు వేశారు.



### బగళాముఖి సేవలో..
పిట్టలవానిపాలెం: చందోలు శ్రీ బగళాముఖి ఆలయానికి ఏపీ హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్ పద్మావతి పడ్నవీర్ కుటుంబ సభ్యులతో విచ్చేశారు. ప్రత్యేక పూజలు చేశారు.




### తిరుపతమ్మకు విరాళం
పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ ఆలయంలోని అంకమ్మ ఉపాలయం వెండి తాపడం తయారీకి సోమవారం జయంత్ సాయి రూ.1,00,116 విరాళం అందజేశారు.

## న్యూస్‌రీల్

### 5 నుంచి గురుకుల జూనియర్ కళాశాలల్లో 3వ విడత ప్రవేశాలు
గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీఆర్ఈఐఎస్) ఆధ్వర్యంలోని జూనియర్, డిగ్రీ కళాశాలల్లో 3వ విడతలో ప్రవేశాలను ఈనెల 5, 6, 7 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి ఆర్.నరసింహారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులకు ఈనెల 5,6,7 తేదీల్లో ఆంధ్ర, 6న రాయలసీమ ప్రాంతాల్లో వేర్వేరుగా కౌన్సెలింగ్ నిర్వహించి, కళాశాలలను కేటాయిస్తామని పేర్కొన్నారు. తాటిపూడి, నిమ్మకూరు, నాగార్జునసాగర్, గుంటూరు (మైనార్టీ) వెంకటగిరి కళాశాలల్లో ఎంపీసీ, ఈఈటీ గ్రూపులకు ఈనెల 5న, బైపీసీ, సీజీటీ గ్రూపులకు ఈనెల 6న, ఎంఈసీ, సీఈసీ గ్రూపులకు ఈనెల 7న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. అలాగే కర్నూలులోని మైనార్టీ బాలురు, గ్యారంపల్లి, కొడిగెనహళ్లిలోని మైనార్టీ బాలికల కళాశాలలతోపాటు వాయల్పాడులోని బనవాసి మైనార్టీ కళాశాలలో అన్ని గ్రూపులకు ఈనెల 6న కౌన్సెలింగ్ ద్వారా సీట్లు భర్తీ చేస్తామని వివరించారు. నాగార్జున సాగర్‌లోని డిగ్రీ కళాశాలలో అన్ని గ్రూపులకు ఈనెల 7న కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు.

### 8,9 తేదీల్లో జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు
గుంటూరు వెస్ట్( క్రీడలు): జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8,9 తేదీల్లో జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామని జిల్లా కార్యదర్శి డి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను అమరావతి రోడ్డులోని హిందూ కళాశాల సమీపంలోని కేఎస్ఆర్ కాన్వెంట్ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేశామని వివరించారు. ఈ నెల 7వ తేదీలోపు తమ ఎంట్రీలను పంపించాలని పేర్కొన్నారు. వివరాలకు 93482 30112 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

### సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 519.60 అడుగుల వద్ద ఉంది. ఇది 148.5482 టీఎంసీలకు సమానం. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 7,459, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. మొత్తం ఔట్‌ఫ్లో 8,359 క్యూసెక్కులు. శ్రీశైలం జలాశయం నుంచి 8,359 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 808.50 అడుగుల వద్ద ఉంది. ఇది 33.4364 టీఎంసీలకు సమానం.

### నేడు గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టులకు సర్టిఫికెట్ల పరిశీలన
గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జోన్-3 పరిధిలో ప్రభుత్వ యాజమాన్యంలోని పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్, తత్సమాన కేడర్లలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు గ్రేడ్-2 హెచ్‌ఎంగా ఉద్యోగోన్నతి కల్పించేందుకు మంగళవారం సర్టిఫికెట్ల పరిశీలన చేపడుతున్నట్లు ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 38 గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టుల ఉద్యోగోన్నతుల కోసం 31-3-2006కు ముందుగా విధుల్లో చేరిన స్కూల్ అసిస్టెంట్, తత్సమాన కేడర్ ఉపాధ్యాయులతోపాటు 10-2-2009కి ముందుగా విధుల్లో చేరిన స్కూల్ అసిస్టెంట్ ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ ఉపాధ్యాయులు తమ సేవా పుస్తకాలు, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హతల సర్టిఫికెట్లతో గుంటూరులోని ఆర్జేడీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు. నిబంధనల ప్రకారం ఎంపిక ప్రక్రియ జరుగుతుందని వివరించారు.

### నేడు జెడ్పీ హెచ్‌ఎం ఉద్యోగోన్నతులకు సర్టిఫికెట్ల పరిశీలన
గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జెడ్పీ యాజమాన్యంలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతి కల్పించేందుకు అర్హులైన అభ్యర్థుల జాబితాను డీఈవోజీఎన్‌టీ.బ్లాగ్‌స్పాట్.కామ్‌లో పొందుపర్చినట్లు డీఈవో పి.శైలజ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబితాలోని స్కూల్ అసిస్టెంట్లు విద్యార్హతల సర్టిఫికెట్లు, సేవా పుస్తకంతో మంగళవారం మధ్యాహ్నం 2.00 గంటలకు గుంటూరు పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్షా భవన్‌లో హాజరు కావాలని సూచించారు. ఈ విషయమై ఉమ్మడి జిల్లాలోని డీవైఈవోలు, ఎంఈవోలు, హెచ్‌ఎంలు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

# శాకంబరీ.. మనసా స్మరామీ

- పూర్ణాహుతితో ముగిసిన ఉత్సవాలు
- మూడు రోజుల్లో 1.60లక్షల మంది అమ్మవారిని దర్శించుకున్నట్లు అంచనా
- కొనసాగిన ఆషాఢ సారె సమర్పణలు





పూర్ణాహుతి కార్యక్రమంలో చైర్మన్ రాంబాబు దంపతులు, ఈవో భ్రమరాంబ (ఇన్‌సెట్) అమ్మవారి ఉత్సవ మూర్తికి పండ్లతో అలంకరణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై శాకంబరీదేవి ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయి. సోమవారం ఉదయం 8 గంటలకు సప్తశతి హవణం, మహా విద్యా పారాయణం, శాంతి పౌష్టిక హోమాలు, మండప పూజలను ఆలయ అర్చకులు నిర్వహించారు. అనంతరం 10.30 గంటలకు మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించగా, చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ఈవో భ్రమరాంబ, ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఆలయ స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకుడు ఎల్‌డీ ప్రసాద్, వైదిక కమిటీ సభ్యులు, వేద పండితులు పాల్గొన్నారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన దాతలు, రైతులు, వ్యాపారులకు అందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నామని ఆలయ అధికారులు పేర్కొన్నారు. మూడు రోజుల్లో సుమారు 1.60 లక్షల మంది భక్తులు అమ్మవారిని శాకంబరీదేవిగా దర్శించుకున్నారని అంచనా వేస్తున్నారు.

**కిక్కిరిసిన ఇంద్రకీలాద్రి..**

ఉత్సవాలలో మూడో రోజైన సోమవారం అమ్మవారిని వివిధ రకాల పండ్లు, కాయలు, డ్రై ఫ్రూట్స్‌తో అలంకరించారు. ప్రధాన ఆలయంతో పాటు లోపల, వెలుపల, ఆలయ ప్రాకారం చుట్టూ బత్తాయి, పైనాపిల్, పుచ్చకాయలు, ద్రాక్షలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. రాజగోపురం ఎదుట ఐస్ దిమ్మెలతో తయారు చేసిన శివలింగం ఆకృతి భక్తులను ఆకట్టుకుంది. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు దేవస్థానం కదంబం ప్రసాదాన్ని అందజేసింది. అమ్మవారి దర్శనంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా దేవస్థాన అధికారులు, పాలక వర్గం ప్రత్యేక చర్యలు చేపట్టింది.

**అమ్మవారి సన్నిధిలో శ్రీలంక ప్రతినిధులు**

ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను శాకంబరీదేవిగా శ్రీలంకకు చెందిన పలువురు ప్రతినిధులు దర్శించుకున్నారు. శ్రీలంక ఈస్టర్న్ ప్రావిన్స్ గవర్నర్ సెంథిల్ తొండమాన్, శ్రీలంక డెప్యూటీ హై కమిషనర్ డాక్టర్ డి.వెంకటేశ్వరన్ అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేయగా, ఆలయ చైర్మన్ రాంబాబు, ఈవో భ్రమరాంబలు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ అధికారులు ప్రసాదాలను అందించారు.

**దుర్గమ్మ సేవలో తెలంగాణ సీఎల్పీ నేత**

తెలంగాణ సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క దంపతులు ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను సోమవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భట్టి విక్రమార్కకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. మహా నివేదన అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న ఆయనకు అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.

### మనసారా.. కొలి'సారె'

పెనుగ్రంచిప్రోలు తిరుపతమ్మ దేవస్థానం నుంచి దుర్గమ్మకు ఆషాఢ సారెను సమర్పించారు. తిరుపతమ్మ ఆలయ చైర్మన్ చిన్నకేశవరావు, ఈవో కె. రమేష్‌నాయుడితోపాటు ఆలయ అధికారులు సిబ్బంది రథం సెంటర్ నుంచి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారి ఆలయానికి చేరుకున్న తిరుపతమ్మ దేవస్థాన అధికారులకు దుర్గగుడి చైర్మన్, రాంబాబు, ఈవో భ్రమరాంబ సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం చీర, పసుపు, కుంకుమ, పూజా సామగ్రిని ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ, ఆలయ అర్చకులకు అందజేశారు. అనంతరం వారికి అమ్మవారి ప్రసాదాలను అందించారు.




చైర్మన్, ఈవోలకు పెనుగ్రంచిప్రోలు అమ్మవారి ఆలయం సమర్పిస్తున్న దేవస్థాన అధికారులు

# ప్రైవేటు రాబడులు

గుంటూరు అరండల్‌పేటకు చెందిన సుధాకర్ ఓ ప్రైవేటు కంపెనీలో చిరుద్యోగి. తన ఇద్దరు పిల్లలను దగ్గర్లోని ఓ ప్రైవేటు పాఠశాలలో చేర్పించాడు. ఒకటో తరగతిలో చేర్పించిన బాబుకు రూ.15వేల ఫీజుతో పాటు పుస్తకాల కోసం అదనంగా రూ.మూడు వేలు చెల్లించాలని స్కూల్లో చెప్పారు. రెండో తరగతిలో చేర్పించిన అమ్మాయికి ఫీజు రూపంలో రూ.18వేలతోపాటు పుస్తకాల కోసం రూ.3,500 చెల్లించాలని చెప్పారు. ప్రభుత్వ పాఠ్య పుస్తకాల వెల రూ.400 లోపే ఉంది కదా అని సుధాకర్ అడిగితే ప్రభుత్వ పుస్తకాలతో తమకు సంబంధం లేదని, స్కూల్లో తామిచ్చే పుస్తకాలనే కొనాలని కరాఖండీగా చెప్పారు.

– ఇదీ ఇప్పుడు ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రైవేటు పాఠశాలల వసూళ్ల దందా..

- ప్రభుత్వ పాఠ్య పుస్తకాల కొనుగోలుకు ముందుకు రాని యాజమాన్యాలు
- ఒకటి నుంచి టెన్త్ వరకు సర్కారువే కొనాలని ఆదేశించినా బేఖాతర్
- బడులు తెరిచేనాటికే పుస్తకాలు సిద్ధం చేసిన పాఠ్యపుస్తక విభాగం
- గుంటూరు జిల్లాలోని 637 ప్రైవేటు స్కూళ్లలో 317 విద్యాసంస్థల నుంచే ఆర్డర్లు
- ప్రైవేటు పబ్లిషర్ల నుంచి పుస్తకాలు కొంటూ రూ.లక్షలు ఆర్జిస్తున్న ప్రైవేటు యాజమాన్యాలు





గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పబ్లిషర్లు ముద్రించిన పాఠ్య పుస్తకాలను విక్రయిస్తున్నాయి. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ సంస్థ (ఎస్సీఈఆర్టీ) రూపొందించిన పాఠ్యాంశాల బోధనకు బదులుగా అనధికార పాఠ్య పుస్తకాలతో తరగతులను నిర్వహిస్తున్నాయి. గుర్తింపు పొందిన పాఠశాలల్లో విద్యార్థులకు ఎస్సీఈఆర్టీ ద్వారా రూపొందించి, ముద్రించిన పాఠ్య పుస్తకాలనే బోధించాలని 2023–24 విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందుగానే జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు అవసరమైన విక్రయ పాఠ్య పుస్తకాలనూ ప్రభుత్వం సకాలంలో సిద్ధం చేసింది. అయితే పాఠశాలల యాజమాన్యాలు వాటిని కొనుగోలు చేయట్లేదు. ప్రైవేటు పబ్లిషర్ల నుంచి అధిక ధరలకు పుస్తకాలను కొని తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నాయి.

**60 శాతం పాఠశాలల్లోనే ప్రభుత్వ టెక్ట్స్‌బుక్స్**

నాణ్యమైన మెటీరియల్‌తో ముద్రిస్తున్న పాఠ్య పుస్తకాలను నామమాత్రపు ధరకే ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన దుకాణాల్లో విక్రయిస్తున్నారు. అయితే ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 1,200 వరకు ఉన్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో మూడు లక్షల మంది విద్యార్థులు చదువుతుండగా, వారికి అవసరమైన 14.68 లక్షల మేర పాఠ్య పుస్తకాలను విద్యాశాఖ అధికారులు సిద్ధం చేశారు. ప్రభుత్వ అనుమతి పొందిన విక్రయదారుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చి పాఠ్య పుస్తక విభాగం ప్రైవేటు పాఠశాలల నుంచి వచ్చిన ఆర్డర్‌కు అనుగుణంగా పుస్తకాలను సరఫరా చేస్తున్నారు. అయితే 60 శాతం ప్రైవేటు స్కూళ్లు మాత్రమే ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు కొని బోధన చేస్తున్నాయి.

**అధికారులు స్పష్టం చేసినా..**

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు అవసరమైన పాఠ్య పుస్తకాలను హెచ్‌ఎం లాగిన్ ద్వారా ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి, కొనేలా ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం దీనిపై విద్యాశాఖాధికారుల ద్వారా పాఠశాలల యాజమాన్యాలకు సమాచారాన్ని చేరవేసింది. ఇటీవల డివిజన్‌స్థాయిలో యాజమాన్యాలతో సమావేశమైన అధికారులు విధివిధానాలను స్పష్టం చేశారు. అయినా ఒక్క గుంటూరు జిల్లాలో 637 ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఉండగా, వాటిలో 317 పాఠశాలలే ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టాయి.

**కచ్చితంగా తీసుకోవాలి**

ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠ్య పుస్తకాలను కచ్చితంగా కొనాలి. లేకుంటే చర్యలు తప్పవు.

– పి.శైలజ, డీఈవో, గుంటూరు

# అర్జీలను గడువులోపు పరిష్కరించాలి

కలెక్టర్ రంజిత్‌బాషా



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: జగనన్నకు చెబుదాం అర్జీలను గడువులోగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం బాపట్ల కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని, రీఓపెన్ కాకుండా చూడాలని అధికారులకు సూచించారు. గ్రామాల వారీగా అర్జీల రీఓపెన్‌పై దృష్టిపెట్టి ప్రణాళిక ప్రకారం పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన సేవలను అందించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీశివ జ్యోతి, జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు, డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ నాయక్, వ్యవసాయ శాఖ జేడీ అబ్దుల్ సత్తార్, పశుసంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు, మత్స్య శాఖ జేడీ సురేష్, డీఎస్ఓ విలియమ్స్, డీఎం శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# దుర్గమ్మకు రూ. 4 లక్షల విలువైన బంగారు హారం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు మంగళగిరికి చెందిన భక్తులు సోమవారం రూ. 4 లక్షల విలువైన బంగారు హారాన్ని కానుకగా సమర్పించారు. మంగళగిరికి చెందిన భోగి సన్యాసిరావు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. సుమారు రూ. 4 లక్షల విలువైన 65 గ్రాముల బంగారంతో తయారు చేయించిన ఫ్యాన్సీ హారాన్ని ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబుకు అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు. కార్యక్రమంలో కాళహస్తి దేవస్థానం చైర్మన్ ఏ. శ్రీనివాసులు, ఈవో కేవీ సాగర్‌బాబు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

# పదో తరగతి విద్యార్థులకు మరో అవకాశం

విద్యాశాఖ ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు



ఈపూరుపాలెంలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆర్జేడీ సుబ్బారావు

వేటపాలెం: ప్రభుత్వం పదో తరగతి తప్పిన విద్యార్థులను మళ్లీ స్కూళ్లల్లో చేర్చుకునే సదవకాశాన్ని కల్పించిందని విద్యాశాఖ గుంటూరు ఆర్జేడీ వి.ఎస్.సుబ్బారావు తెలిపారు. సోమవారం కొత్తపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో ఈ డ్రైవ్‌ను లాంఛనంగా ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థుల సౌకర్యార్థం ఈ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టినట్లు చెప్పారు. పదో తరగతిలో ఫెయిలైన విద్యార్థులకు మళ్లీ స్కూళ్లలో చేరితే రెగ్యులర్ విద్యార్థులకు మాదిరిగానే ప్రభుత్వ పరమైన అన్ని సౌకర్యాలు, పథకాలు వర్తిస్తాయన్నారు. టెన్త్ క్లాస్ ఈసారి పాస్ అయితే రెగ్యులర్‌గా ఉత్తీర్ణుడైనట్లు సర్టిఫికెట్ కూడా లభిస్తుందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పదిలో తప్పిన ఎనిమిది మంది విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేర్పించే కార్యక్రమం చేపట్టారు. జగనన్న విద్యాకానుకలను పంపిణీ చేశారు. కార్మక్రమంలో హెచ్‌ఎం గుమ్మా శ్రీనివాసరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ విక్టోరియా, ఎంఈవో జేవీ సుబ్బయ్య పాల్గొన్నారు.

**జెడ్పీ హైస్కూల్‌ను పరిశీలించిన ఆర్జేడీ..**

చీరాల అర్బన్: ఈపూరుపాలెం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను సోమవారం ఆర్జేడీ సుబ్బారావు పరిశీలించారు. పాఠశాలలోని తరగతి గదులు, పాఠశాల ఆవరణ, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పదోతరగతి ఫెయిలైన విద్యార్థినులను ప్రోత్సహించి తిరిగి వారిని చేర్చుకోవాలని సూచించారు. ఐదుగురు విద్యార్థినులను పాఠశాలలో చేర్చుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు సుబ్రహ్మణ్యం, సుధారాణి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కె.హనోరా, ఎస్.పద్మజ, సీఆర్పీ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కల నెరవేరే వేళ

- జాతీయ రహదారిగా కొండమోడు–పేరేచర్ల రోడ్డు
- విస్తరణకు చురుగ్గా అడుగులు
- నాలుగు మండలాల్లో 464.28 ఎకరాల భూ సేకరణ
- మూడు మండలాల్లో 19.6 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్ల నిర్మాణం
- నేడు, రేపు సత్తెనపల్లి ఆర్డీఓ కార్యాలయంలో ఆరు గ్రామాల రైతులతో సమావేశం
- హాజరు కానున్న పల్నాడు జేసీ శ్యామ్ ప్రసాద్



పేరేచర్ల–కొండమోడు ప్రధాన రహదారి

సత్తెనపల్లి:గుంటూరు–హైదరాబాద్ ప్రధాన మార్గంలోని గుంటూరు జిల్లా పేరేచర్ల నుంచి పల్నాడు జిల్లా కొండమోడు వరకు ఉన్న రహదారి నిత్యం రద్దీగా ఉంటోంది. రద్దీకి తగినట్టు ఈ మార్గం విస్తరణ జరగకపోవడంతో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఈ రోడ్డులో ప్రయాణం అంటేనే ప్రజలు హడలిపోయే దుస్థితి వచ్చింది. ఫలితంగా ఈ దారిని విస్తరించాలని ఏన్నో ఏళ్ల నుంచి డిమాండ్ ఉన్నా.. గత పాలకులు పట్టించుకోలేదు. రహదారి విస్తరణ జరిగిపోతుందని కాగితాల్లో చూపించారే తప్ప వాస్తవ రూపం దాల్చలేదు. ఈ క్రమంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణ దేవరాయలు సింగిల్ రోడ్డుగా ఉన్న ఈ రహదారిని నేషనల్ హైవే జాబితాలో చేర్పించారు. అనేకమార్లు కేంద్రమంత్రులను కలిసి రహదారి ప్రాధాన్యాన్ని వివరించి నాలుగు వరుసల రహదారిగా విస్తరించేందుకు కృషి చేశారు. ఫలితంగా ప్రస్తుతం రహదారి విస్తరణకు చురుగ్గా అడుగులు పడుతున్నాయి. దీంతోపాటు మేడికొండూరు, సత్తెనపల్లి, కొండమోడు వద్ద బైపాస్ రోడ్లు నిర్మించేందుకూ అధికార యంత్రాంగం కార్యాచరణ ప్రారంభించింది.

**విస్తరణ ఇలా..**

తాడికొండ నియోజకవర్గంలోని మేడికొండూరు మండలం పేరేచర్ల నుంచి సత్తెనపల్లి నియోజకవర్గంలోని రాజుపాలెం మండలం కొండమోడు వరకు 49.91 కిలోమీటర్ల ప్రధాన రహదారి ఇది. దీనిని నాలుగు వరుసలుగా 45 మీటర్ల వెడల్పున విస్తరించేందుకు 464.28 ఎకరాలు సేకరించాలని అధికారులు నిర్ణయించారు. మేడికొండూరు మండలంలో 87.55 ఎకరాలు, సత్తెనపల్లి మండలంలో 175.25 ఎకరాలు, ముప్పాళ్ళ మండలంలో 64.96 ఎకరాలు, రాజుపాలెం మండలంలో 136.52 ఎకరాలు భూసేకరణలో ఉంది. ఇదికాక పిడుగురాళ్ళ, బెల్లంకొండ మండలాల్లో కొంత భూమి సేకరించాలి. భూసేకరణ కోసం మూడు బృందాలు సర్వే పనులు ముమ్మరంగా చేపట్టాయి. ప్రభుత్వ, పట్టా భూములను గుర్తించడంతోపాటు పలు సర్వే నంబర్లలో రైతుల వివరాలను నమోదు చేశాయి.

**రైతులతో సమావేశాలు**

పేరేచర్ల–కొండమోడు రహదారి విస్తరణకు సంబంధించి భూములు కోల్పోతున్న 12 గ్రామాలకు చెందిన 572 మంది రైతులతో పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ సమావేశాలు నిర్వహించి పరిహారం విషయమై చర్చిస్తున్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే గత నెల 27న పిడుగురాళ్ళ తహసీల్దార్ కార్యాలయంలో పిడుగురాళ్ల మండలానికి సంబంధించి 28 మంది రైతులతో, బెల్లంకొండ తహసీల్దార్ కార్యాలయంలో బెల్లంకొండ మండలానికి సంబంధించిన 20 మంది రైతులతో, గత నెల 30న రాజుపాలెం తహసీల్దార్ కార్యాలయంలో రాజుపాలెం మండలం కుబాద్‌పురానికి చెందిన 66 మంది, చౌటపాపాయ పాలెంకు చెందిన 29 మంది, రాజుపాలెంకు చెందిన 38 మంది, రెడ్డిగూడెంకు చెందిన 81 మంది రైతులతో సమావేశమయ్యారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సత్తెనపల్లి ఆర్డీఓ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లకు చెందిన 91 మంది, కంకణాలపల్లికి చెందిన 21 మంది, సత్తెనపల్లికి చెందిన ఒకరు, ఈ నెల 5న వడ్డవల్లికి చెందిన 77 మంది, నందిగామకు చెందిన 65 మంది, కంటెపూడికి చెందిన 55 మంది రైతులతో సమావేశం కానున్నారు.

### మూడు బైపాస్‌లు ఇలా..

పేరేచర్ల–కొండమోడు ప్రధాన రహదారి నాలుగు వరుసలుగా విస్తరించనున్న నేపథ్యంలో మూడు మండలాల్లో 19.6 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్లు నిర్మించనున్నారు.

- మేడికొండూరు మండలంలో గుంటూరు–నరసరావుపేట మార్గంలోని డోకిపర్రు నుంచి మేడికొండూరులోని దర్గా వరకు 5.5 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు.
- సత్తెనపల్లి మండలం నందిగామ అడ్డరోడ్డు సమీపంలోని బచ్చగుంట నుంచి ధూళిపాళ్ల రెవెన్యూ గ్రామ పరిధిలోని గిడ్డంగుల వరకు 11.2 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు రానుంది.
- రాజుపాలెం మండలం అనుపాలెం సమీపంలోని ఆర్వోబీ నుంచి కొండమోడుమీదుగా పిడుగురాళ్ళ బైపాస్ రోడ్డును కలుపుతూ 2.9 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు నిర్మితం కానుంది.

# ● ముత్యాల పందిరిలో విహరించె

నిండుపున్నమి వేళ.. ముత్యాల పందిరిలో.. దేవేరులతో కలిసి సర్వాంగ సుందరంగా ముస్తాబైన మంగళగిరి నృసింహుడు వెన్నెల వాకిళ్లలో విహరించాడు. భక్తజనులను దివ్య మంగళ స్వరూపంతో కటాక్షించాడు. ఫలితంగా భక్తిపారవశ్యం ఉప్పొంగింది. ఆధ్యాత్మికోత్సాహం పరవళ్లు తొక్కింది. గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో ముత్యాల పందిరి ఊరేగింపు వైభవంగా జరిగింది. కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి స్వామి, దేవేరులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముత్యాల పందిరి ఊరేగింపు సేవలో పాల్గొన్నారు. ఇదిలా ఉంటే 1200 మంది కళాకారులతో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది.

– మంగళగిరి



ఊరేగింపులో స్వామిదేవేరులు

## అధిక దిగుబడులు సాధించిన రైతులకు అభినందన



కలెక్టరేట్‌లో ఆదర్శ రైతులను గౌరవిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: ఆధునిక సాంకేతిక విధానాలు, సేంద్రియ ఎరువులతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించిన ఇద్దరు రైతులకు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ప్రశంసా పత్రాల్ని అందజేసి సత్కరించారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే రైతు వందనంలో భాగంగా ఈ వారం వినుకొండ నియోజకవర్గంలోని బొల్లాపల్లి మండలానికి చెందిన ఇద్దరు ఉద్యాన రైతులు మేడం బక్కిరెడ్డి, మేడం శ్రీనివాసరెడ్డిలను సన్మానించారు. పమిడిపాడుకు చెందిన రైతు మేడం బక్కిరెడ్డి ఎకరం విస్తీర్ణంలో రూ.30వేలు ఖర్చుతో జామ తోట వేశారు. సాధారణ విధానంలో ఆరు టన్నుల వరకు దిగుబడినిచ్చే జామ రైస్టు బెడ్, డ్రిప్ విధానంతో పాటు సేంద్రియ ఎరువుల్ని వాడుతూ ఆర్గానిక్ పద్ధతిలో సాగుచేసి ఏడు టన్నుల దిగుబడి సాధించాడు. పండు ఈగను పచ్చి మిరప, వేపాకు, కలబంద, ఉల్లి పాయలతో ద్రావణం చేసి మొక్కలకు స్ప్రే చేయడం ద్వారా నివారించాడు. డ్రిప్ ద్వారా పాండుగవ్య, పంచగవ్య అందించటంతో కాయ నాణ్యతతో దిగుబడి పెరిగింది. ఎకరాకు రూ.లక్ష ఆదాయం సమకూరగా పెట్టుబడి పోను ఎకరాకు రూ.70వేలు ఆదాయం లభించింది. గరికపాడు గ్రామానికి చెందిన మేడం శ్రీనివాసరెడ్డి ఐదెకరాల పొలంలో తైవాన్ రకం జామ పంట వేసి 35 టన్నుల దిగుబడిని సాధించాడు. దీనికి ఖర్చు రూ.1.5లక్షలు కాగా, ఆదాయం రూ.5లక్షల వరకు వచ్చింది. రూ.3.5లక్షలు మిగిలింది. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాదు, ఉద్యాన శాఖ జిల్లా అధికారి బీజే బెన్నీ, డీఆర్వో కె.వినాయకం, డ్రిప్ ఇరిగేషన్‌శాఖ జిల్లా అధికారి ఆంజనేయులు, వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఐ.మురళి పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను అరికట్టాలి

**కలెక్టర్ పి.రంజిత్‌బాషా**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారుల్ని ఆదేశించారు. తన చాంబర్‌లో సోమవారం జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇసుక రేవుల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు చెప్పారు. కొల్లూరు మండలం ఓలేరు వాగులో ఇసుక పూడిక తీతపై వారితో చర్చించారు. 25 వేల క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వడానికి అవకాశం ఉందని అధికారులు ఆయన దృష్టికి తెచ్చారు. పరిశీలించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. బాపట్ల జిల్లా పరిధిలో కొత్తగా ఇసుక రేవులు గుర్తించడానికి అనుబంధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. కొందరు విచక్షణారహితంగా రోడ్డు పక్కన, కాలవలు, చెరువు గట్ల వెంట ఇసుక తవ్వకాలు జరుపుతున్నారనే ఆరోపణలపై నివేదిక ఇవ్వాలని అధికారుల్ని ఆదేశించారు. మండల స్థాయిలో తహసీల్దార్లతో ప్రత్యేక బృందాల్ని నియమించి, తనిఖీలు చేయించాలని జిల్లా సంయుక్త కలెక్టర్‌కు ఆయన సూచించారు. పర్యావరణ ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున అధికారుల నిశిత పరిశీలన ఉండాలని చెప్పారు. ఇసుక అక్రమ తవ్వకాలు జిల్లాలో జరిగితే సహించేది లేదని, సెబ్ అధికారులు కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సీహెచ్. శ్రీధర్, ఆదనపు ఎస్పీ మహేష్, జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి ఆర్.రాజేష్ కుమార్, సెబ్ సూపరింటెండెంట్ నరసింహారావు, ఆర్డీవో చంద్రశేఖర్‌రెడ్డి, అనుబంధ శాఖల అధికారులు, జేపీ వెంచర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించండి

- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్
- వృద్ధులు, వికలాంగుల సమస్యలపై సహృదయంతో వ్యవహరించాలి



పక్షవాతంతో బాధపడుతున్న ఇలియాజ్ సమస్యను తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల టౌన్: స్పందన అర్జీల్ని సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 61 మంది బాధితులు వచ్చి తమ సమస్యల్ని వివరించారు. ఎస్పీ వారి నుంచి ఫిర్యాదుల్ని తీసుకుని, సంబంధిత అధికారులకు పరిష్కార నిమిత్తం పంపారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌కు, పోలీస్ కార్యాలయాలకు వచ్చే వృద్ధులు, వికలాంగులు, మహిళలతో సహృదయ భావనతో వ్యవహరిస్తూ, వారి సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. స్పందన కార్యక్రమంలో ముఖ్యంగా కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, భూ వివాదాలు, ఆర్థికపరమైన అంశాలతో కూడిన ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని, వాటిని జాగ్రత్తగా పరిష్కరించాలని ఆయన సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి. మహేష్, స్పందన సెల్ సీఐ వి.మాలకొండయ్య పాల్గొన్నారు.

- చందోలు గ్రామానికి చెందిన మహ్మద్ ఇలియాజ్ పక్షవాతంతో బాధపడుతున్నారు. అతనికి చెందిన స్థలాన్ని కొందరు వ్యక్తులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పక్షవాతంతో బాధపడుతూ మెట్లు ఎక్కివస్తున్న విషయాన్ని గమనించి ఎస్పీ నేరుగా కార్యాలయం బయటకు వచ్చి ఆయన సమస్య తెలుసుకున్నారు. సంబంధిత ఎస్ఐతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

## బాపట్ల వ్యవసాయ కళాశాల దేశానికే గర్వకారణం

**అగ్రి మిషన్ వైస్ చైర్మన్ ఎం.వి.యస్. నాగిరెడ్డి**



నాగిరెడ్డికి జ్ఞాపికను అందిస్తున్న అసోసియేట్ డీన్ శ్రీనివాసరావు

బాపట్ల: బోధన, పరిశోధనలతో పాటు వ్యవసాయ విస్తరణ విభాగాల్లో బాపట్ల వ్యవసాయ కళాశాల దేశానికే గర్వకారణమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అగ్రి మిషన్ వైస్ చైర్మన్ ఎం.వి.యస్.నాగిరెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయ కళాశాలలో విద్య, పరిశోధన పరిశీలన నిమిత్తం సోమవారం అగ్రి మిషన్ శాశ్వత కార్యనిర్వాహక సభ్యుడు ఎం.చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చరవాణి వ్యసనమవడం బాధాకరమని, దానికై అధిక సమయాన్ని వెచ్చిస్తూ వారు విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారని తెలిపారు. ఆ వ్యసనాన్ని వీడి గ్రంథాలయాల్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉత్తమ విద్యా బోధనతోపాటు ఈ కళాశాల క్రమశిక్షణకు మారుపేరని, ఇందులో చదివిన వారు ఎందరో సివిల్ సర్వీసెస్‌లో ఉన్నారని గుర్తు చేశారు. విద్యార్థుల సమస్యల్ని స్వయంగా ఆయన అడిగి తెలుసుకున్నారు. కళాశాలలోని గ్రంథాలయం, ఇన్‌డోర్ స్టేడియం, ప్రయోగశాలల్ని సందర్శించి వాటి స్థితిగతుల్ని ఆయన అడిగి తెలుసుకున్నారు. ఐడీపీ హాలులో జరిగిన సమావేశంలో బోధన సిబ్బందితో సమస్యలపై చర్చించారు. మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రయోగశాలల్ని మెరుగుపరచవలసిందిగా సూచించారు. ప్రభుత్వం వ్యవసాయ విద్యకు ప్రాధాన్యతో పాటు వ్యవసాయ కళాశాల అభివృద్ధికి తోడ్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## వైభవంగా ఆదిజాంబవ మహర్షి గురుపూజోత్సవం



మంత్రి అంబటిని సన్మానిస్తున్న మాణిక్య వర ప్రసాద్

పాత గుంటూరు: అరండల్‌పేటలోని మోహన రంగ నాయక స్వామి దేవస్థానంలో గురు పౌర్ణమి సందర్భంగా మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్య వరప్రసాద్ ఆధ్వర్యంలో ఆది జాంబవ మాదిగ మహర్షి గురు పూజోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు పాల్గొన్నారు. మహామునికి పూజలు, హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పలువురు ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

- **పప్పు ధాన్యాల మిల్లుల నిర్వాహకులు స్టాకు వివరాలు ఇవ్వాలి**

నరసరావుపేట: జిల్లాలోని కందిపప్పు మిల్లుల యజమానులు స్టాకు వివరాలను వెంటనే ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని జేసీ ఏ శ్యాంప్రసాద్ ఆదేశించారు. సోమవారం దాల్ మిల్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించి కందిపప్పు సేకరణపై చర్చించారు.



# నలుగురు గంజాయి విక్రేతల అరెస్టు

**4.57 కిలోల గంజాయి, స్కూటీ స్వాధీనం**



వివరాలు తెలుపుతున్న ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్, పక్కన ఏఎస్పీ మహేష్, మంగళగిరి రూరల్ పీఎస్ సీఐ భూషణం

నగరంపాలెం: గంజాయికి బానిసై విక్రయించే నలుగురు యువకుల్ని మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 4.570 కిలోల గంజాయి, స్కూటీని సీజ్ చేశారు. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీవో) ఆవరణలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ వివరించారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగ నియంత్రణలో భాగంగా ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం చినకాకాని కంతేరు రోడ్డులో వేప చెట్టు వద్ద గంజాయి విక్రయించే మంగళగిరి ప్రాతూరు గ్రామ వాసి బండ్ల ప్రశాంత్, పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలోని సూళ్ళూరుపేట బాపూజీనగర్‌కు చెందిన ఈదులమూడి సాత్విక్, తాడేపల్లి మండలం చిర్రావూరు గ్రామానికి చెందిన మొండితోక రత్నతేజ, మొండితోక రజనీకుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. నేరం రుజువుకావడంతో ఆ నలుగురిని అరెస్ట్ చేసి, రూ. 4.570 కిలోల గంజాయి, 136 తెల్లని కాగితాలు, స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. వీరికి చింతపల్లి మండలం నుంచి గంజాయిని విక్రయించిన సరఫరాదారుడు మోహన్‌ను అక్కడి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందులో ప్రధాన సూత్రధారి అయిన శృంగారపాటి ప్రవీణ్ అలియాస్ బాష, ప్రశాంత్ స్నేహితులు. చెడు వ్యసనాలకు బానిసై గంజాయి తాగేవారు. అధిక డబ్బులు సంపాదించాలనే దురాశతో విక్రయించడం ప్రారంభించారు. చింతపల్లి మండలం డేగలవానిపాలెం గ్రామ వాసి మోహన్, అతని తల్లి వద్ద గంజాయి కిలోల చొప్పున కొనేవారు. అందులో కొంత తాగేవారు. మిగతాది పొట్లాల మాదిరిగా చేసి అధిక ధరలకు విజయవాడ, తాడేపల్లి, మంగళగిరిలోని యువకులకు విక్రయించేవారు. వారి అనుచరులైన సాత్విక్, రత్నతేజ, రజనీకుమార్, దాస్‌లు కూడా విక్రయించే వారిలో ఉన్నారు. వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవారు. ఇటీవల ప్రవీణ్ రోడ్డు ప్రమాదంలో గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నలుగురిని అరెస్టు చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో ఏఎస్పీ (ఎస్ఈబీ–సెబ్) డీఎన్.మహేష్, సీఐ వి.భూషణం, ఎస్ఐ జె.క్రాంతికిరణ్ పాల్గొన్నారు.



## ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఆత్మహత్య ?



శ్రీనివాసరెడ్డి మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు



శ్రీనివాసరెడ్డి (ఫైల్)

చెరుకుపల్లి: ముందు రోజు అంతా స్నేహితులతో ఉత్సాహంగా గడిపి మరుసటి రోజు ఉదయం అనూహ్యంగా ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తుమ్మల పాలెంలో సోమవారం ఉదయం జరిగింది. గ్రామానికి చెందిన పిట్టు రామచంద్రారెడ్డి, రత్తమ్మ దంపతుల మూడో కుమారుడు శ్రీనివాసరెడ్డి (36) మగళగిరి ఏపీఎస్పీ 6వ బెటాలియన్‌లో 14సంవత్సరాలుగా కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. వివాహం కాలేదు. ఇటీవల గ్రామంలో అమ్మవారి కొలుపులకు సెలవుపై ఇంటికి వచ్చాడు. అప్పటి నుంచి చిన్ననాటి స్నేహితులతో సంతోషంగా గడుపుతున్నాడు. సోమవారం ఉదయాన్నే విధులకు వెళ్లేందుకు ఇంటి నుంచి శ్రీనివాసరెడ్డి బయలుదేరి వెళ్లాడు. ఆ తర్వాత ఇంటికి సమీపంలో ఉన్న రేకుల షెడ్డు తలుపులు తీసి ఉండటం గమనించిన మృతుడు తండ్రి రామచంద్రారెడ్డి లోపలకు వెళ్లగా కుమారుడు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఆయన కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి తాడు ఊడ తీయగా, అప్పటికే శ్రీనివాసరెడ్డి మృతి చెందాడు. అసలు ఎందుకు ఉరి వేసుకున్నాడో తెలియడంలేదని కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతం అయ్యారు. సమాచారం తెలుసుకున్న రేపల్లె రూరల్ సీఐ శివశంకర్, స్థానిక ఎస్ఐ కొండారెడ్డి ఘటన స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుని తండ్రి రామచంద్రారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాసరెడ్డి మృతిపై వివరాలు తెలియాల్సి ఉంది.

## రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా స్విమ్మింగ్ జట్ల ఎంపిక



పల్నాడు జిల్లా జట్టుకు ఎంపికైన స్విమ్మర్లు

నరసరావుపేట ఈస్ట్: 8వ సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికల స్విమ్మింగ్ జట్లను ఎంపిక చేసినట్లు పల్నాడు జిల్లా స్విమ్మర్స్ అసోసియేషన్ కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. ఎంపికైన జట్టు ఈనెల 8,9 తేదీల్లో నరసరావుపేటలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పల్నాడు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. జిల్లా నుంచి 42 మంది స్విమ్మర్లు ఎంపిక పోటీల్లో పాల్గొనగా 20 మంది జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన వారిలో సబ్ జూనియర్ బాలుర విభాగంలో ఎం.తేజేష్‌సాయి, ఎం.ఎన్.వి.రామసాయినీలేష్, జి.ఎల్.శ్రీపద్మనాభరెడ్డి, బి.అర్నవ్‌రెడ్డి, సీహెచ్.సాకేత్‌రామ్, టి.కుషాల్, కె.షణ్ముఖ సత్యవీర రుత్విక్, ఓ.దేవహర్ష, ఎస్.మహదేవ్‌రెడ్డి, బి.సత్యవర్ధన్, బి.మోహనమురళీకృష్ణ, ఓ.సుకాంత్, బాలికల విభాగంలో టి.హర్షిణి, ఆర్.లక్ష్మీలాస్యప్రియ, జూనియర్ బాలుర విభాగంలో బి.హరీష్ కుమార్, జె.జోషిత్‌సాయి, ఎల్.ఇషాన్‌గౌతమ్, బాలికల విభాగంలో బి.అవని, పి.పి.విన్సీ, వై.భక్తివైష్ణవి ఉన్నారు.